క్లుప్తంగా

కొనసాగుతున్న 'భగీరథ' ఇంటింటి సర్వే

తలకొండపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం మిషన్ భగీరథ ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. మండల వ్యాప్తంగా 11,461 ఇళ్లు ఉండగా ఇప్పటి వరకు 11,147 ఇళ్లలో సర్వే పూర్తిచేసినట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ తెలిపారు. 97శాతం సర్వే పూర్తయ్యిందని, ఇంకా రెండు రోజుల్లో 100శాతం సర్వే పూర్తి అవుతుందని ఎంపీడీఓ తెలిపారు. సర్వేలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి నల్లా ఉందా లేదా అని చెక్ చేస్తున్నారు. నల్లా లేకుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే నల్లా కనెక్షన్ అందజేస్తున్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన సాంబశివ, మైసమ్మ ఇటీవల మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి గురువారం మృతుల కుటుంబాలను పరామర్శించి రూ.6000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, యాదయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, శేఖర్, రామ్మోహన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీను కుటుంబాన్ని ఆదుకుంటాం

తలకొండపల్లి: చాకలి శ్రీను కుటుంబానికి ఆదుకుంటామని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన చాకలి శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వెల్దండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జెడ్పీటీసీ వెంకటేశ్ గురువారం ఆస్పత్రికి వెళ్లి శ్రీనును పరామర్శించారు. ట్రస్టు సభ్యులచే రూ.21,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ట్రస్టు సభ్యులు బుచ్చిబాబు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రశీదు ఇవ్వాలి

మండల వ్యవసాయ అధికారి శ్రీలత



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీలత

కడ్తాల్: రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినపుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత డీలర్లకు సూచించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్, విత్తనాల దుకాణాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. షాపుల వద్ద ధరల పట్టిక, ఎరువుల నిల్వలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని, సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ అభినవ్, డీలర్లు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ



అనురాధ అధ్యక్షతన కొనసాగుతున్న కౌన్సిల్ సమావేశం

తుర్కయంజాల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ ఆదేశించారు. గురువారం ఆమె అధ్యక్షతన రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో అభివృద్ధికి సంబంధించి 24 అంశాలపై కౌన్సిల్‌లో చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి.చంద్రశేఖర్, వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించాలి

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సాయిచరణ్

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేపట్టాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సాయిచరణ్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో ప్రభుత్వం మారిందే తప్ప విద్యార్థుల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతలేని మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 24 వేల ఉపాధ్యాయుల పోస్టులను మెగా డీఎస్సీ వేసి భర్తీ చేయాలని అలాగే బడుల్లో అటెండర్, స్కావెంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జగదీశ్, నగర కార్యదర్శి మహేందర్, నాయకులు.. పవన్, నవీన్, చరణ్ పాల్గొన్నారు.

అలంకారప్రాయమేనా..?





పెద్దఅంబర్‌పేటలోని అర్బన్ ఫారెస్ట్ పార్కు, (ఇన్‌సెట్‌లో) వాకింగ్ ట్రాక్‌పై పెరిగిన గడ్డి

- నిరుపయోగంగా పెద్దఅంబర్‌పేట అర్బన్ ఫారెస్ట్ పార్కు
- ప్రారంభించి మూడేళ్లైనా నేటికీ అందుబాటులోకి రాని వైనం
- శిథిలావస్థలో వాకింగ్ ట్రాక్, యోగా సెంటర్
- వినియోగంలోకి తేవాలంటున్న స్థానికులు

అబ్దుల్లాపూర్‌మెట్: హెచ్ఎండీఏ, రాష్ట్ర అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన అర్బన్ ఫారెస్ట్ పార్కు మూడేళ్లుగా అలంకారప్రాయంగా మారింది. అప్పటి రాష్ట్ర మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, సబితారెడ్డి చేతుల మీదుగా ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. నగర శివారు ప్రజలతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్రయాణించే వారికి, స్థానికులతో పాటు, పరిసర గ్రామాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన పెద్దఅంబర్‌పేట అర్బన్ ఫారెస్ట్ పార్కును ప్రారంభించినప్పటికీ అది నేటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్బన్ ఫారెస్ట్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వాడుకలోకి తేకపోవడంతో..

అర్బన్ పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా పచ్చని చెట్లు, ఔషధ మొక్కలను నాటడంతో పాటు ప్రజలు వాకింగ్ చేసుకునేందుకు వీలుగా వాకింగ్‌ట్రాక్, యోగా సెంటర్, విశ్రాంతి భవనంతో పాటు అక్కడక్కడా కూర్చునేందుకు బల్లలను ఏర్పాటు చేశారు. అయితే పార్కును వాడుకలోకి తీసుకురాకపోవడంతో అందులోని విశ్రాంతి భవనం, యోగా కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో పాటు వాకింగ్‌ట్రాక్‌పై గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి.

అందుబాటులోకి తేవాలి

అర్బన్ ఫారెస్ట్ పార్కు ప్రారంభం కాగానే మా గ్రామానికి సమీపంలోనే పార్కు ఏర్పాటు చేశారని సంతోషపడ్డాం. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడంతో పాటు యోగా సాధన చేసుకునే అవకాశం ఉంటుందని మిత్రులంతా ప్రణాళికలు వేసుకున్నాం. అయితే మూడేళ్లైనా పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. పార్కును అందుబాటులోకి తేవాలి.

– శ్రీధర్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట

నీట్ పరీక్షను రద్దుచేయాలి

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సామెల్
- ఇబ్రహీంపట్నంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు సామెల్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం రహదారిపై గురువారం ఆ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సామెల్ మాట్లాడుతూ.. 24 లక్షల విద్యార్థుల జీవితాలతో ఎన్‌డీఏ ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి.. మరలా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్లేశ్, గణేశ్, జగన్, బుగ్గ రాములు, రమేష్, వీరేష్, చరణ్, రాఘువేందర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎంఈఓ సర్దార్‌నాయక్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ సర్దార్‌నాయక్

ఆమనగల్లు: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని ఎంఈఓ సర్దార్‌నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని విఠాయిపల్లి ప్రాథమిక పాఠశాల, చంద్రాయణపల్లి తండా ప్రాథమిక పాఠశాల, ఆమనగల్లు కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల విద్యాలయాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న పలువురు ఉపాధ్యాయులకు ఇప్పటికే మెమోలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రత్యేకాధికారి పద్మజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా నాయకురాలు స్వప్న



నోడల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కడ్తాల్: మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు స్వప్న డిమాండ్ చేశారు. ఈ విషయమై ఈనెల 24న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు సంబంధించి నోడల్ అధికారి జంగయ్యకు గురువారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కార్మికులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు లక్ష్మమ్మ, వరలక్ష్మి, బుజ్జమ్మ, బాలమణి, లలిత, సనా తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నూతన మండల కార్యవర్గాన్ని సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షురాలిగా లక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శిగా వరలక్ష్మి, సభ్యులుగా బుజ్జమ్మ, సనా, అలివేలు, భాగ్యమ్మ, బాలమణి, లలితను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి స్వప్న, సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఉన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి



జిల్లా వైస్ చైర్మన్, నూతన కమిటీ సభ్యులను సన్మానించిన అతిథులు

కందుకూరు: కందుకూరు లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా సురసాని విఠల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం రాత్రి కందుకూరులో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ జి మహేంద్రకుమార్‌రెడ్డి, నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుని గురువారం ప్రకటించారు. అధ్యక్షుడితో పాటు సెక్రటరీగా తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తాను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైస్ చైర్మన్ మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్లబ్ సభ్యులు ప్రతి నెలా కనీసం ఒక్కసారైన సమావేశమవ్వాలన్నారు. సభ్యులు సభ్యత్వ రుసుమును సకాలంలో చెల్లిస్తే సమాజ సేవకు ఖర్చుచేయొచ్చన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన విఠల్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ తరపున సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడతానని పేర్కొన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా కేబినెట్ మెంబర్ తాళ్ల అంజయ్య, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు బీఆర్ రాంరెడ్డి, ఎస్.వెంకట్‌రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబితారెడ్డిపై విమర్శలు మానుకోవాలి

- బీఆర్ఎస్ తుక్కుగూడ అధ్యక్షుడు లక్ష్మయ్య

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మాజీ మంత్రి, పి సబితా ఇంద్రారెడ్డిపై బీజేపీ నాయకులు చేస్తున్న విమర్శలు మానుకోవాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుక్కుగూడ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేయొద్దని బీజేపీ నాయకులు ఈ నెల19న ధర్నా చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా సబితాఇంద్రారెడ్డిపై విమర్శలు చేయ డం బాధాకరమన్నారు. సబితా ఇంద్రారెడ్డి గతంలో మంత్రిగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకురాలని కొనియాడారు. మహిళ ఎమ్మెల్యే అని కనీస గౌరవం ఇవ్వకుండా ఆరోపణ చేయడం సరికాదన్నారు. మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే బీఆర్ఎస్ కూడా పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రవినాయక్, సప్పిడి లావణ్య, సుమన్, శ్యామేల్ రాజు, బాకారం వెంకట్‌రాజిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ జ్యోతి పథకం అమలు చేస్తాం

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: జీరో బిల్లు పథకం లబ్ధిదారులకు తప్పకుండా అమలు చేస్తామని మున్సిపల్ కమిషనర్‌బి. వెంకట్రామ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన క్యాంపును అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ప్రజాపాలన సందర్భంగా ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తులు తీసుకున్నామని, జీరో బిల్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించిఅర్హులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఇప్పటి వరకు 70 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆ కంపెనీని మూసివేయండి

కార్యదర్శికి డీవైఎఫ్ఐ నాయకుల వినతి

ఇబ్రహీంపట్నం: దండుమైలారం గ్రామ పరిధిలోని హఫీజ్‌పూర్ సర్వే నంబర్–36 భూముల్లో ఏర్పాటు చేసిన బ్యాటరీలను కరిగించే ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని డీవైఎఫ్ఐ నాయకులు యాదగిరి, లింగం డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డికి గురువారం వారు వినతిపత్రం సమర్పించారు. బ్యాటరీలను కరిగించే ఫ్యాక్టరీతో కాలుష్యం పెరిగి ప్రజల ప్రాణాలకు హానికరంగా మారిందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కంపెనీని నడిపిస్తున్నట్లు వారు ఆరోపించారు. కంపెనీని మూసివేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్లో తాత్కాలిక పద్ధతిలో గంటల ప్రాతిపదికన బోధించుటకు ఆసక్తి కలిగినవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి ధనుంజయ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహేశ్వరం మోడల్ స్కూల్, కాలేజీలో బోధన చేయుటకు ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హత, అనుభవం, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. టీజీటీ హిందీ, పీజీటీ మ్యాథ్స్, పీజీటీ ఫిజిక్స్, పీజీటీ ఇంగ్లీష్, పీజీటీ కామర్స్ సబ్జెక్టుల వారీగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. టీజీటీ పోస్టులకు డిగ్రీ, బీఎడ్ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. పీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టు లో పీజీ, బీఈడీ ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 22న తేదీలోగా కళాశాలలో ఇవ్వవలసిందిగా తెలిపారు. మరిన్ని వివరాలకు 9849746567, 9603150011 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 71, వంకాయ 35, బెండ 55, పచ్చిమిర్చి 85, కాకర 65, బీర 72, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 23, క్యారెట్ 40. దొండ 45, ఆలు 35, ఉల్లి 39, గోకర 55, దోస 27, సొర 17, పొట్ల 23, అరటి 11, చిక్కుడు 70, అర్వి 37, మునగ 80, చిలగడదుంప 50, బీట్‌రూట్ 23, కీర 33, ఫ్రెంచ్ బీన్స్ 175, కాప్సికమ్ 80.

విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎంపీటీసీ ఉమావతి

ఎంపీటీసీ సభ్యురాలు ఉమావతి

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎంపీటీసీ సభ్యురాలు ఉమావతి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమావతి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని అన్నారు. ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, పాఠశాల కమిటీ చైర్మన్ కౌసల్య, నాయకులు.. సుమన్, బాబు, వెంకటేశ్, రమేష్, చోటే, శంకర్, శ్రీకాంత్, జంగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ ఆధ్వర్యంలో..



ఇబ్రహీంపట్నం రూరల్: పిల్లలకు మాత్రలు వేస్తున్న ఎంపీటీసీ మంగ

నులిపురుగులను నలిపేద్దాం

19 ఏళ్లలోపు పిల్లలందరికీ నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలని వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీల్లో బాలబాలికలకు గురువారం నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. ఈ మాత్రలు తీసుకోవడం వలన పిల్లల్లో పెరుగుదల వేగంగా ఉంటుందని, జీర్ణ సమస్యలు తలెత్తవని అన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లు: విద్యార్థికి అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



కడ్తాల్: విద్యార్థులకు ట్యాబ్లెట్లు వేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



తలకొండపల్లి: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



యాచారం: చిన్నారులకు మాత్రలు వేస్తున్న ఎంపీపీ సుకన్య